# 20. హత్యకేసులో హతుని సాక్ష్యం

అప్పుడే తెల తెలవారుతోంది. ప్రాక్‌దిగ్మండలపై పరచుకున్న ప్రభాతకాంతులు చీకటి తెరలను చీల్చి చెండాడుతున్నాయి. వాటి ధాటికి తట్టుకోలేక తారలు కూడా భీతావహులై నింగి వెనక్కి పారిపోతున్నాయి. పట్టణ ప్రజలు పడకలపై అటూఇటూ దొర్లుతూ లేవడానికి సమాయత్తమవుతున్నారు. పక్షులు కూడా తమ తమ గూళ్ళు వదలి ఆహారాన్వేషణ కోసం ఆయత్తపడుతున్నాయి.

దైవారాధనలో నిమగ్నులయ్యే దాసులకు ప్రశాంతవాతావరణం అది. దైనందిన జీవితంలో తిరిగి లీనమయ్యేవారికి పగటి కార్యక్రమాన్ని సూచించే సమయమది. కాని పట్టణ ప్రధానద్వారం దగ్గరే వళ్ళు గగుర్పొడిచే దృశ్యం! మసక వెల్తురులో ఒక శవం నెత్తుటి మడుగులో భయంకరంగా పడివుంది!!

"అయ్యో నాయనోయ్! నా తమ్ముడ్ని ఎవరో చంపేశారు!!"

"వాయ్ దేవుడోయ్! నా అన్నను ఎవరో పొట్టన బెట్టుకున్నారు!!"

"అయ్యయ్యో! నా సోదరుడ్ని ఎంత దారుణంగా చంపేశారు దుర్మార్గులు!!"

ఈ ఏడ్పులు, పెడబొబ్బలు విని నలువైపుల నుంచి జనం హత్యాస్థలానికి పరుగెత్తుకొచ్చారు. ఈ గందరగోళానికి నమాజ్‌లో నిమగ్నులై ఉన్న హ(జత్ మూసా (అలైహి)కు కూడా ఏకాగ్రతాభంగం కలిగింది.

"దైవప్రవక్తా! పెద్దఘోరం జరిగిపోయింది. పట్టణ ప్రధానద్వారం దగ్గర మా పెదనాన్న కొడుకుని ఎవరో హత్యచేసి పడవేశారు" అన్నాడు బిన్యామీన్ అనే వ్యక్తి ఒకతను.

"నా చిట్టితమ్ముడు నన్ను వదిలేసి పోయాడు. అతడే నా సర్వస్వం దైవప్రవక్తా!" అంటూ బిన్యామీన్ సోదరుడు యూషే బావురుమన్నాడు.

"మా సోదరుడ్ని ఇంత దారుణంగా చంపిన ఆ దుర్మార్గుడ్ని వెతికి పట్టుకొని రక్త పరిహారం తీసుకునేదాకా మేము నిద్రపోము" అన్నాడు వారిద్దరి తమ్ముడు హుస్నైన్.

"ఆగండి. మీకు ఎవరి మీద అనుమానం ఉందో ముందు చెప్పండి" అడిగారు హ(జత్ మూసా (అలైహి).

"దైవప్రవక్తా! ఎవరు చంపారో మాకేమీ తెలియదు. మీకున్న విద్యావివేచనలతో ఏదైనా ఆచూకీ తెలుస్తుందేమోనని మీ దగ్గరికొచ్చాము" అన్నారా ముగ్గురు అన్నదమ్ములు.

"అలాగైతే బనీఇస్రాయీల్ వాళ్ళను సమావేశపరచండి. వారి పెద్దలను, నాయకుల్ని కూడా పిలుచురండి" ఆదేశించారు హ(జత్ మూసా (అలైహి).

ఇస్‌హాఖ్ హత్యావార్త పట్టణంలో దావానలంలా వ్యాపించిపోయింది. యూదులంతా ఆందోళనపడుతూ ఓచోట సమావేశమయ్యారు. ఇస్‌హాఖ్ తల్లిదండ్రులు, అతని బాబాయి



కొడుకులు రోదిస్తూ గుండెలు బాదుకుంటూ వచ్చి ఆ సమావేశంలో కూర్చున్నారు.

ఇస్రాయీల్‌సంతతి ప్రజలారా! ఈ శవం పట్టణ ప్రధానద్వారం దగ్గర దొరికింది. ఇతడ్ని చంపినవారెవరో చెప్పండి. ప్రపంచశిక్ష పరలోకశిక్ష కన్నా మేలైనదని గ్రహించి హత్యానేరాన్ని ఒప్పుకోండి" అన్నారు హ(జత్ మూసా (అలైహి).

"మాకేమీ తెలియదు. హత్యాస్థలం దగ్గర మేము లేనేలేము" అన్నారు కొందరు. "హత్యసంగతి ముందుగా ఎవరికి తెలిసిందో వాళ్ళనడగండి" అన్నారు మరికొందరు.

"దైవప్రవక్తా! ఈ శవాన్ని మేము బనీయహూదా వారి ద్వారం దగ్గర పడివుంటే చూశాం" అన్నాడు బిన్యామీన్. (సభలో కలకలం!)

"అబద్ధం. నువ్వు పచ్చి అబద్ధం పలుకుతున్నావు. మాకేమీ తెలియదు. ఈ హత్యతో మా వంశస్థులెవరికీ ఎలాంటి సంబంధం లేదు" అన్నారు యహూదా తెగవాళ్ళు.

"అయితే హతుని తండ్రిని అడుగుదాం... ఏం హిజ్ఖీల్! నీ కొడుకుని చంపిందెవరో నీకెవరి మీదయినా అనుమానం ఉందా?" అడిగారు హ(జత్ మూసా (అలైహి).

"నా తమ్ముని కొడుకులే ఈ హత్య చేసి ఉంటారని నా అనుమానం. ఎందుకంటే నా ఆస్తి మీద వాళ్ళ కన్ను పడింది. ఈ ఆస్తి నా తదనంతరం వారసత్వంగా నా కొడుకు ఇస్‌హాఖ్ మాత్రమే దక్కవలసివుంది" అన్నాడు హిజ్ఖీల్. (సభలో మరోసారి కలకలం!)

"కాదు, కాదు. మీరు అనవసరంగా మమ్మల్ని అనుమానిస్తున్నారు. దైవసాక్షి! మేము ఏ పాపం ఎరగం. ఈ హత్యతో మాకెలాంటి సంబంధం లేదు" అన్నారు ఆ ముగ్గురు అన్నదమ్ములు ముక్తకంఠంతో.

"ఇస్రాయీల్ సంతతి ప్రజలారా! ఇక చాలించండి. మీరు చీటికి మాటికి ఒట్లు వేసుకుంటారు. చివరికి అబద్ధపు ఒట్లు వేసుకోవడానికైనా మీరు వెనుకాడరు. త్వరలోనే దేవుడు ఈ రహస్యాన్ని బట్టబయలుచేసి యదార్థం తెలియజేస్తాడులే, వెళ్ళండిక" అన్నారు దైవప్రవక్త హ(జత్ మూసా (అలైహి).

అక్కడ్నుంచి యూదులు కేకలుపెడ్తూ, అల్లరిచేస్తూ తమతమ ఇండ్లకు బయలుదేరారు.

"సత్యం త్వరలోనే బయటపడుతుంది" అన్నాయి కొన్ని కంఠాలు. "ఇలాంటి పాపాత్ముల్ని నరకం అట్టడుకు పంపాలి" మరికొన్ని కంఠాలు.

జనం వెళ్ళిపోయిన తర్వాత హ(జత్ మూసా (అలై)పై దివ్యావిష్కృతి అవతరించింది. ఆయన మరోసారి యూదులను సమావేశపరిచారు. ఈసారి దైవప్రవక్త (అలైహి) ఏం చెబుతారోనని యూదులు ఉత్కంఠతో ఎదురుచూడసాగారు.

"ఈరోజు సత్యం స్పష్టంగా మన ముందుకు వస్తుంది" కొందరు గుసగుసలాడారు.

"ఈ దెబ్బతో హంతకులెవరో ఈరోజు తేలిపోతుంది" అన్నారు మరికొందరు.

"ప్రజలారా! నిశ్శబ్దంగా కూర్చోండి. మీ ప్రభువు నుండి తీర్పు వచ్చేసింది. ఆయన ఒక ఆవును జిబహ్ చేయమని ఆజ్ఞాపిస్తున్నాడు" అన్నారు మూసా (అలైహి).

"ఏమిటీ, ఆవును జిబహ్ చేయడమా!" అంటూ ఆశ్చర్యపోయారు యూదులు.

"దీనివల్ల నిజానిజాలు బయటపడతాయంటారా?" అన్నాడు ఒకతను.

"మూసా! ఈ మాటలు మాతో పరిహాసానికైతే అనడం లేదుకదా!" మరొకతను.

"ఆవుకు, హత్యాసంఘటనకు సంబంధం ఏమిటీ? హంతకుడి ఆచూకీ చెప్పడానికి మమ్మల్ని పిలిపించారు మీరు. కాని ఇదేమిటి?" అన్నాడు వేరొకడు.

ఆ వెనువెంటనే ఇకిలింపులు, సకిలింపులు, అల్లర్లు, అలజడులతో సభ మార్మోగింది.

"ఇస్రాయీల్‌సంతతి ప్రజలారా! అల్లరి చేయకండి. వినండి నేను మిమ్మల్ని పరిహాసం చేయడంలేదు. పరిహాసం చేయడానికి నేను బుద్ధిహీనుడ్ని కాను" అన్నారు మూసా(అలై).

"నా జాతిప్రజలారా! దేవుని ఆగ్రహానికి, ఆయన శిక్షకు భయపడండి. ఇది దైవాజ్ఞ, జరిగితీరుతుంది. దీనిపై వాదోపవాదాలు చేయడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు" జాతిశ్రేయస్సు కోరే ఒక వ్యక్తి అన్నాడు.

"అయితే మూసా! ఎలాంటి ఆవును వధించాలి?" అడిగాడు ఒకతను.

"ఔను మూసా! ఆ సంగతి మరిచేపోయాము. నీ ప్రభువుని అడిగి అది ఎలాంటి ఆవయి ఉండాలో చెప్పు."

"నిజమే. దైవాజ్ఞను నెరవేర్చడంలో ఎలాంటి అపచారం జరగ్గూడదు కదా!" అంటూ యూదులు దైవప్రవక్త చెప్పినట్లు చేయకుండా అనవసరమైన ప్రశ్నలు అడగసాగారు.

"మీ పరిస్థితి చూస్తుంటే మీరు ప్రతిసారీ నన్ను వ్యతిరేకించడానికే నిశ్చయించు కున్నట్లు కన్పిస్తోంది" అన్నారు హజ్రత్ మూసా (అలైహి) విచారం వెలిబుచ్చుతూ.

"వినండి, ఆ ఆవు మరీ ముసల్దిగా ఉండకూడదు; మరీ లేతదిగానూ ఉండకూడదు. మధ్య వయస్సుదయి ఉండాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. మీకు లభించిన ఈ ఆజ్ఞను శిరసావహించడంలో ఇక ఆలస్యం చేయకండి" అన్నారు ఆయన.

"అరె! మేము ఆవు రంగుని గురించి అడగటం మరచిపోయాం" అన్నదొక కంఠం.

"అది ఎరుపు వర్ణంతో మిసమిసలాడుతూ ఉండాలి." చెప్పారు హజ్రత్ మూసా (అ).

(మరొకసారి పకపకలు! బెకబెకలు!!)

"సోదరులారా! ఆ పాడు ఆవు కారణంగా మనం పెద్దఆపదలో చిక్కుకున్నాం. ఇప్పుడు మూసా చెప్పిన ప్రత్యేకతలున్న ఆవు కాకడా పెట్టి వెతికినా కన్పించదు" అన్నాడు వెనుక గుంపులో కూర్చున్న ఓ నడికారు వ్యక్తి.



"అయితే మూసానే అడుగుదాం పదండి. విచిత్రమైన ఈ ఆవుకుండే సూక్ష్మ ప్రత్యే కతలు ఏమిటో మరింత వివరంగా తెలుసుకుందాం" అన్నాడు మరొకడు.

"ఔన్రోయ్! మరిన్ని వివరాలు అడిగి తెలుసుకుంటేనే మంచిది. ఆవులన్నీ దాదాపు ఒకే విధంగా కన్పిస్తాయి. వాటిలో మూసా చెప్పే ఆవేదో గుర్తించడం కష్టమవుతుంది ఆతర్వాత" అన్నాడు వేరొకడు. ఈ మాటలు కూడా హజ్రత్ మూసా (అలైహి)కు చేర వేశారు కొందరు. అప్పుడాయన మరింత వివరంగా ఇలా చెప్పారు.

"ఆ ఆవు సేద్యానికి, మోటబావి నుండి నీళ్ళు తోడటానికి ఉపయోగించబడనిదయి ఉండాలి. అంతేగాకుండా అది ఎలాంటి వ్యాధిగాని, అంగవైకల్యంగాని లేకుండా పూర్తి ఆరోగ్యవంతమైనదయి ఉండాలి. మరే విధమైన లోపం ఉండకూడదు."

సమావేశం ముగిసింది. అందరూ తమతమ ఇండ్లకు వెళ్ళిపోయారు.

మరుసటి రోజు నుంచి యూదులు గోఅన్వేషణలో పడ్డారు. ఎన్నో ఊళ్ళు తిరిగారు. మరెన్నో ప్రాంతాలు గాలించారు. గోఅన్వేషణలో ఇలా అనేక రోజులు గడచిపోయాయి. చివరికి ఒక అనాథబాలుడి దగ్గర ఈ ఆవు దొరికింది. అయితే ఆ బాలుడు అంత సులభంగా ఇవ్వదలచుకోలేదు. ఆవు ఎత్తు బంగారం ఇస్తేగాని వదలనని పట్టుబట్టాడు. దానికి యూదులు ఒప్పుకొని అడిగినంత డబ్బిచ్చి ఆవును కొనుక్కున్నారు. దాన్ని తీసు కొచ్చి హజ్రత్ మూసా (అలైహి) సన్నిధిలో జిబహ్ చేశారు.

"మూసా! ఇదిగో ఆవును జిబహ్ చేశాం. ఇక దీని వెనుక దాగివున్న రహస్యం ఏమిటో చెప్పండి" అన్నాడు ఒకతను.

"అయితే హతుని భౌతికకాయాన్ని కూడా తీసుకురండి" అంటూ ఆదేశించారు హజ్రత్ మూసా (అలైహి).

"హత్య జరిగి ఎంతో కాలమయింది. ఈపాటికి అతని పక్కటెముకలు కూడా కరిగి మట్టిలో మట్టయి పోయివుంటాయి. అలాంటి హతుని సంగతి ఇప్పుడెందుకు?" అన్నారు కొందరు యూదులు.

"మీరతడ్ని మరచిపోయివుంటే ఉండవచ్చు. కాని ఆకాశన్యాయస్థానం ఈ విషయాన్ని విస్మరించలేదు. హతుని శరీరానికి ఈ ఆవు నాలుకతో తాకించమని దేవుడు ఆదేశిస్తు న్నాడు. అలా చేసిన తరువాత ఆయన శక్తిసామర్థ్యాలను చూడండి" అన్నారు మూసా (అ).

ఆయన చెప్పినట్లే చేశారు యూదులు. మరుక్షణం హతుడు శరీరం నుంచి రక్తం చిందుతుండగా లేచినిల్చున్నాడు. అనూహ్యమైన ఈదృశ్యం చూసి ప్రజలంతా కొయ్యబారి పోయారు. హతుడు ప్రాణంతో లేవడం చూడగానే హునైస్, అతని సోదరుల గుండెలు గుబిల్లు మన్నాయి. హునైస్ మనోవీథిలో అనాటి సంఘటనలు ఒక్కసారిగా మెదిలాయి.

"ఏవిట్రా! ఈ జీవితం పట్ల నువ్వు తృప్తిగా ఉన్నావా? అటు మన పెదనాన్న కోట్లకు

పడగలెత్తి కాటికి కాళ్ళు జాపివున్నాడు. ఇక్కడ మనమేమో నిష్ఠ దారిద్ర్యంతో మాడి చస్తున్నాం" అన్నాడు యూషే.

"అయితే ఏం చేద్దాం? పెదనాన్న ఆస్తికి వారసుడిగా అతని కొడుకు ఇస్‌హాఖ్ ఉన్నాడు కదా!" అన్నాడు హుసైన్.

"హిజ్కీల్ చావకముందే మనమేదైనా యుక్తి పన్నాలి. లేకుంటే మనమిలా జీవితాంతం దారిద్ర్యంలోనే మగ్గి ఉండాల్సివస్తుంది" అన్నాడు బిన్యామీన్.

"అంటే...? విధి నిర్ణయాన్ని మనం మార్చగలం అంటావా?"; "పరిస్థితి అర్థం చేసుకో. పేదరికం నుంచి బయటపడేందుకు మనం ఏదో ఒకటి చెయ్యక తప్పదు."

"మీరిద్దరు కలసి ఏం గూడు పుఠానీ చేయబోతున్నారో నాకర్థం కావడంలేదు."

"గూడూ లేదు, పుఠానీ లేదు. మేము బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాం. పెదనాన్న ఆస్తిని స్వాధీనం చేసుకోవడం తప్ప మనకు వేరే దారిలేదు."

"అదెలా సాధ్యం, ఇస్‌హాఖ్ అతని వారసుడు కదా?"

"భలేవాడివిరా నువ్వు! విషయం నీకు ఒక పట్టాన అర్థంకాదులే. అతడ్ని మనం మన దారి నుంచి తొలగించుకోవాలి."

"అంత పనికి పాల్పడవద్దన్నయ్యా! తండ్రి ఆస్తి కోసం అతని కొడుకు ప్రాణం తీయడం చాలా అన్యాయం" అన్నాడు హుసైన్ ఆందోళనతో.

"ఆ బడుద్ధాయి అష్టయిశ్వర్యాలతో తులతూగుతుంటే మనం పస్తులతో బతుకుబండి భారంగా ఈడ్చడం అంతకంటే అన్యాయం."

"సరే, మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి. కాని నన్ను మాత్రం క్షమించి వదిలెయ్యండి"

"అదేం కుదరదు. ఈ పనిలో నిన్ను కూడా కలుపుకావాలని మేము ముందే నిశ్చయించుకున్నాం. కాదంటే ఇస్‌హాఖ్‌కు పట్టబోయే గతే నీకూ పడుతుంది. మేమీ మాటలు ఆషామాషీగా అనడం లేదు."

"దీని పర్యవసానం గురించి ఏమైనా కాస్త ఆలోచించారా?"

"పర్యవసానం లేదు, పచ్చి బద్దల్లేవు. ముందు ఈ పని జరగాలి. నీ సచ్ఛీలం, సదాచరణల్ని కాస్త పక్కనబెట్టి చేతికి చిక్కేది తీసుకొని హాయిగా జీవితం గడుపు."

"కార్యక్రమం నిశ్చయించాం. ఈరాత్రే మనం ఇస్‌హాఖ్ కోసం మాటువేసి కూర్చోవాలి. పొద్దుకుంకిన తర్వాత అతను పొలం నుంచి తిరిగొస్తాడు. ముగ్గురం ఒకేసారి అతనిపై మెరుపుదాడి చేసి అంతమొందించాలి. ఆ తర్వాత శవాన్ని ఎత్తుకుపోయి తెల్లారకముందే పట్టణ ద్వారం దగ్గర పడవేయాలి."

..........................................................................................



"ఇస్‌హాఖ్! నిన్ను హత్యచేసినవారెవరో చెప్పు" హజ్రత్ మూసా (అలైహి) హతుడ్ని ఉద్దేశించి అడిగారు.

"నా పినతండ్రి కొడుకులే... నా తండ్రి ఆస్తికి వారసులు కావడానికి నా పినతండ్రి కొడుకులే నన్ను హత్యచేశారు. హత్యచేశాక వారు నా శవాన్ని పట్టణద్వారం పడేశారు" హతుడు ఇస్‌హాఖ్.

"వీరేనా నిన్ను హత్యచేసింది! పైగా ఏమీ తెలియనట్లు దొంగేడుపు ఏడుస్తున్నారే!!" అన్నారు కొందరు.

"ఎంత ఘోరం! మనం చేయని ఈ ఘోరపాపం వల్ల పరస్పరం కలహించుకొని రక్తపాతం జరుపుకునే దాకా వెళ్ళాం" అన్నది ఓ కంఠం.

"ఈ నంగనాచి హంతకుల నుంచి ప్రతీకారం తీర్చుకునే తీరాలి" అన్నది ఓ గుంపు.

"ఇస్రాయీల్‌సంతతి ప్రజలారా! మరణించిన మనిషిని దేవుడు బ్రతికించలేడని మీరు భావించారు. కాని ఏ విధంగా దేవునికి చంపే శక్తి ఉన్నదో ఆవిధంగా బ్రతికించే శక్తి కూడా ఆయనకుంది. ఈ విషయం మీ బుర్రకు తట్టలేదు" అన్నారు హజ్రత్ మూసా (అలైహి) విచారం వెలిబుచ్చుతూ.

"అంతటి గొప్పమహిమ చూసినా మీలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమై పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటిఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలిపోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి. దేవుడు మీ చేష్టలను గమనించడంలేదని భావించకండి. (ఖుర్‌ఆన్-2:74)

**(సమాప్తం)**